# నిజాయితీగల మనిషి

ఆయేడు పొలాలన్నీ విపరీతంగా పండాయి. మాట్లాడితే ఇవకేసుకుపోయే కొల్లేరుభూమిలో కూడా వరి, డెల్టాలలో మాగాణిపంటని మించి పుష్కలంగా పండింది; దేశమంతా సుభిక్షంగా వుంది.

ఇంకా కోతలు కాలేదు. చేనిగట్టుమీద రామన్న కాపు ఎగువకి నడిచి వెడుతున్నాడు. పండిన వరి కంకులు గలగలమంటూ, బంగారు చిరుమువ్వలు మోతలా, లయతప్పని సంగీతాన్ని వినిపిస్తున్నాయి; చేలమధ్య విచ్చిన కాజపువ్వులు పైనించి పడిన వెన్నముద్దల్లా మెరుస్తున్నాయి; నీళ్లతూరలోనించి బోదినీళ్లు చెలగాటమాడుతున్నాయి.

చేను విరగపండుతోంది - ఎకరాకి పుట్టీ పండుమవుతుందని అంచనా వేసుకున్నాడు రామన్నకాపు.

కోతలయ్యాయి; కుప్ప నూర్పిళ్లు పూర్తిచేసుకునేసరికి ప్రొద్దుగూకిపోయింది. మేలురాశీమీద పంట ధాన్యమంతా కళ్లంలోనే వుంచేసి, ముద్దర్లు వేసి, ఆరుబయట మంచులో తను పడుకోలేక, పెద్దబ్బాయి మునియ్యనీ, ముగ్గురుపాలేళ్లనీ కాపలావుంచి, ఇంటికొచ్చేశాడు రామన్న కాపు.

యుద్ధమొచ్చిపడింది. విపరీతంగా ధరలు పెరిగిపోయి, పొట్ట గడవక, పాటకజనమంతా ధాన్యపు రాసులమీదా, బట్టల బేళ్లమీదా, లూటీలు సాగిస్తున్నారక్కడక్కడా.

కీడెంచి మేలెంచమన్నాడు - ఎందుకైనా మంచిది - ప్రొద్దుపొడవకుండానే లేచివెళ్లి, కళ్లంలోనే కాటావేయించి, అసామికివ్వాలిసిన అమరక ధాన్యం చెల్లించిపారేసి, మిగిలిన గింజా గట్రా, గడ్డీ గాదమూ, నింపేసుకుంటే వొదిలిపోతుంది అనుకుంటూ, కన్ను మూశాడు రామన్న కాపు.

పెరట్లో ఒరలనుయ్యి దగ్గిర చెమ్మలో విచ్చిన చామంతి మడిమీదనించి కమ్మని వాసనలు చల్లటి నిదరకి చక్కలిగింతలై, తెల్లవారగట్ట హాయిగా మెళుకువవచ్చింది. ఆపైన కిర్రుచెప్పులేసుకుని,

లంకపుగాకు చుట్ట చెకుముకి రాయితో వెలిగించి, బుట్ట తలపాగా పెట్టుకుని, పుంతదారిని పొలిమేరదాటేసి, వొత్తయిన పచ్చని జనపచేలమిలమిలా, గుత్తులు గుత్తులై ఎండిపోయిన కందికాయల గలగలా కలిసిపోయి కరిగిపోతున్నచోట మలుపుతిరిగి, దూరాన్ని గడ్డిమేటి పక్కని వేళ్లాడుతున్న విడీవిడని పొగమంచు గిరికీలలోనించీ తేరిపారజూశాడు.

మునియ్య గుండెలు గవుక్కుంటో, వొగురుస్తూ చేల కడ్డంబడి వొస్తున్నాడు. రామన్న కాపుకి గుండెల్లో రాయిపడింది.

"ఇంకేముంది – కొంప గుణ్ణమయిపోయింది – కళ్లంలో జొరబడి దోచేస్తున్నా" రన్నాడు. ఇద్దరూ గబగబా పరిగెట్టుకుని వెళ్లారు.

కళ్లంలో ఒక్క మనిషిపురుగు లేదు – ఎవరి ఆచోకీ దొరకలేదు. చుట్టుపక్కల కొట్టాలలో నించి పదిమంది పాలేళ్లూ చేరారు. తెగవెతికినా ఎవరిజాడా కనిపించలేదు. రాశీమీదవుండగా నిన్న వేసిన అంచనాబట్టి, సగానికి సగం నష్టమయిపోయివుండాలని వూహించాడు రామన్న కాపు.

ఊళ్లో గుప్పుమంది. లోకానికేముంది – అదుగో పులి అంటే ఇదుగోతోక అంటుంది. ఆ మాట ఎలా పొక్కిందో – ఆ నోటా ఆ నోటా పాకి చిలవలూ పలువలూ వేసుకుని ఊడలు కిందకి దింపుకుంటోంది అప్పిడే: రామన్నకాపు ఆసామికియ్యాలిసిన కట్టుబడి ధాన్యానికి తొంట చెయ్యి చూపుదామని ఈ ఎత్తు వేశాడురా అని పుకారుపుట్టింది. తగువుల చావిట్లోనూ, నీళ్లతూరల దగ్గిరా, మోటబావుల వెనకా గుసగుసలు బయలుదేరాయి.

రామన్న కాపుగూడా కర్ణాకర్ణిగా విన్నాడు. అతనికి కష్టమనిపించింది. ఆదినించీ రామన్న కాపు ఫామేదాకల రైతనీ, నిజాయితీగల మనిషి అనీ, పేరుమోసిన ఆసామీ.

భూమికామందు వీరభద్రయ్యగారుండగానే, నలుగురికీ అర్థమయ్యేలాగ అనేశాడు:

"వాడెవడో దుర్మార్గుడు నా కడుపుమీద కొట్టాడుగాని, భద్రయ్యగారికియ్యాలిసిన ధాన్యంలో వొక్క గింజ తరగలేదు" అని. దానితో అందరినోళ్లూ కట్టడిపోయాయి.

అన్నమాట ప్రకారం, మధ్యాన్నం కళ్లంలోనే కాటావేయించి, భద్రయ్యగారి కియ్యాలిసిన 80 బస్తాల ధాన్యమూ గోతాలలో కెక్కించి అప్పగించేసి, మిగిలిన 10 బస్తాల గింజలూ వినాయకుడి చేగతో సహా కమతగాణ్ణి పట్టించుకెళ్లమని, కళ్లంలో నొల్లగా కూలీలని తీసుకొమ్మని, తను దులిపేసుకుని కూచున్నాడు. పశువులికి, గ్రాసుమాత్రం, కొద్దో గొప్పో మిగిలింది.

గూడెంలో సంతకని సరుకువేసుకుని వెళ్లిన బళ్లు చీకటి పడితేనేగాని రావు – కళ్లంలో కామందుగారి పట్టుబడిధాన్యం దిగడిపోయింది.

రామన్న కాపు అగ్నిహోత్రంలాంటివాడురా, అని చెప్పుకున్నారంతా. భద్రయ్యగారికి మొట్టమొదటినించీ ధైర్యమే, రామన్న కాపు అన్యాయం తలపెట్టడని.

ఒకల్లిద్దరు భద్రయ్యగారితో అన్నారటకూడా – ఏదో సత్యకాలపు రైతు, వో ఇరవై

బస్తాలైనా ముట్టజెప్పండి - వుసురుపెడితే మనకిమాత్రం దక్కుతుందటయ్యా, అని. ఆయనే మన్నాడో రామన్న కాపుకి తెలియలేదు గాని, సాయంత్రం ధాన్యం పట్టించుకుని రమ్మనమని గుమాస్తాని పంపించి, ఆయన మొహం చాటేసిందాన్నిబట్టి, ఒకవేళ, తను కడుపు కక్కుర్తిపట్టలేక, బిడియం చంపుకుని, దేహీ అని అడిగినా, నోరు ఖాళీ తప్పితే, మరి ప్రయోజనంలేదని నిర్ధారణయి పోయింది. అప్పిడే ధాన్యం బేరానికిచ్చినట్టు కూడా అతని చెవినిపడింది.

సరే ఇంక బళ్లొచ్చిం తరవాత గింజలు భద్రయ్యగారింటికి తోలిపెట్టి రండ్రా అని, గుమాస్తా గారడిగినమీదట, మాటతీసెయ్యలేక ముగ్గురు కుర్రాళ్లనీ పాలేళ్లనీ, పురమాయించి, ఓగంట పొద్దున్నదనగా ఇంటికొచ్చేసి పడుకున్నాడు రామన్న కాపు.

ఇంటో పిల్లామేకా, దొడ్లోగొడ్డూగోదా, ఈ కామాటమంతా వొకయేడు ఎలా ఈడ్చునా, అనే ధ్యాసలో పడిపోయాడు.

సంకురాత్రి పండక్కి రాబోయే కూతురూ, అల్లుడూ; మనమడికి చేయిస్తానన్న వెండి పాయసం గిన్నే, మధుమాసంలో తలపెట్టిన పెద్దకొడుకు పెళ్లీ - ఇవన్నీ మొహాలు ముడుచుకుని చుట్టూ మూగుతుంటే - వీట్లన్నిటినీ వెనక్కి తోసేసి, నిరుడు మదుపులకనీ, దరిమిలా కలుపుతీతలకి ముందు ఇంటివాడకానికనీ, షావుకారుదగ్గిర తెచ్చిన రెండువందల ప్రోనోటూ ముందుకొచ్చి, కళ్లయదట తాండవమాడుతోంది.

తనైతే సజావైన మనిషి అనిపించుకున్నాడే గాని పెరట్లోవున్న ధాన్యపుగాదెలూ, వాట్లతో పాటు ఇంటోవాళ్ల బ్రతుకులూ, వో యేడాదిపాటు ఖాళీఅయి చక్కా వూరుకున్నాయి. తరిచి తరిచి చూచుకుంటే, ఇన్నాళ్లూ మంచివాణ్ణి అనిపించుకోవాలనే జబ్బు తనలో ఎందుకింత తీవ్రంగా జీర్ణించిపోయి ఉంటోవచ్చిందో అతనికి బోధపల్లేదు. భద్రయ్యగారు కూడా రామన్న కాపు అంటే 'ఓహో' అన్నాట్ట! అంటే తన కడుపునిండిందా? మాట్టాడితే నాలుగుమెరమెచ్చు మాటలు తన మొహమ్మీద యదాలాభంగా జల్లిపోయేవాళ్లంతా, నాలుగు ధాన్యం బస్తాలు తన ఇంటోకి నెట్టగలిగారా? తను చాలా ఖచ్చితమైన మనిషి, అని ఇన్నాళ్లూ ప్రజలచేత పొందుతూ వచ్చిన మన్నన అంతా, తనలోపల ఎక్కడో, ఏమూలనో, వొదిగివున్న ఏ చాతగాని ఆహారపదార్థంగా వినియోగపడుతో వచ్చిందా?

ఈ ఇచ్చకాలన్నీ తన కుంపట్లో నిప్పులాపిరి కుక్షిలో వెలిగించడంకన్నా చేసిందేమన్నా వున్నదా వీసం? తను రవ్వంత కుమ్మక్కు చెయ్యగలిగితే ఈ దారిద్ర్యం నిలుస్తుందా? నిజానికి వీరభద్రయ్యగారు తనకి రావాలిసిన ధాన్యమంతా గుంజుకోటంలో తప్పేముంది? 'అతివృష్టి అనావృష్టి చోరక్షామా ద్యరిష్టాదులతో నిమిత్తం లేకుండా' అని కవులు కాయితమ్మీదవున్న షరతే ఆయెను. అది తనని బాధించే షరతూ, భద్రయ్యని భద్రంగా కాపాడే షరతూను.

దొంగతనం చెయ్యకుమాఅని శాస్త్రకారుడు అన్నాడూ అంటే, అది ఆస్తివున్నవాడికి కాపుదల; లేనివాడికి పళ్లచెట్టుచుట్టూ ముళ్లకంచి; లేనివాడికి కావాలిసింది తెచ్చిపెట్టే బాధ్యత అది తన నెత్తిమీద పెట్టుకోదు. వెతుక్కోమంటుంది. అబద్ధమాడకు నాయనా అనే నీతి, అబద్ధమాడా

లిసిన అవసరాన్ని – సబబైనదే కానీయండి – కాసువీసం గుర్తించదు. నా పనికాదంటుంది. చివరికి ఈ శ్రీరంగనీతులన్నీ ఎటువైపు మొగ్గుతున్నాయో, ఆజాద, ఇన్నాళ్లకి కళ్లకి కట్టినట్టవు పించింది. మళ్లీ ఈ నీతిచక్రమంతా ఉన్నవాళ్లకి రక్షణచెయ్యాలిసినచోటుమాత్రం, పీనల్ కోడ్ల తోటీ, క్రిమినల్ కోర్టులతోటీ, లాయర్లతోటీ, లాబుక్కులతోటీ, లాఠీలతోటీ, తుపాకులతోటీ మాంచి బందోబస్తుగా నిలబడుతుంది.

ఇంతకీ తెగించి తన నీతిని తను సృష్టించుకోవాలి. ఒకళ్ల నీతిని తను పాటిస్తే!!

పంచపాళీలో కొయ్యభోషాణం పక్కని ఏమిటో వెతుక్కుంటున్నాడు మునియ్య. కళ్లంలో నించి వొచ్చినట్టున్నాడు.

"పెద్దబ్బాయ్!"

వొచ్చి నిలబడ్డాడు మునియ్య.

"బళ్లు కదిలినట్టేనా?"

"ఏదీ? ఇప్పుడే వచ్చాయి బళ్లు – కమ్మీ కర్ర మర్చిపోయా."

మళ్లీ తనపనిలో తనున్నాడు.

"ఇటు చూడు."

చెప్పేదామా వొద్దా అని గుంజాటనలో పడ్డాడు.

"సరేలే వెళ్లు."

మునియ్య వెళ్లిపోతున్నాడు. ఈసారి తప్పకుండా వొట్టి పిరికితనం? మంచితనం మాత్రం కాదు; ఆ విచక్షణ ఇన్నాళ్లకి తెలిశొచ్చింది.

మళ్లీ పిలిచాడు. వొచ్చి నిలబడ్డాడు. ఓ పావుగంట సేపు చెవిలో నూరిపోశాడు. మునియ్య నిర్ఘాంతపడి నిలుచుండి పోయాడు. ఇంకా ఏవో కుంటిప్రశ్నలు వేదామని, లోపల మధనపడు తున్నట్టు గ్రహించాడు రామన్న కాపు.

"చొప్పదంటు ప్రశ్నలు వెయ్యకు – ఏమిటా నానుడు? చెప్పినట్టు చెయ్యి, ఫో" అన్నాడు, ఇక తిరుగులేదన్నట్టు.

మునియ్య తలవొంచుకుని వెళ్లిపోతున్నాడు.

"పాలెంలో... మామయ్యగారి వడ్లపురిలో... తెలిశిందా?"

తలవూపాడు.

ఎంతకీ బళ్లు రాకపోతే, వీరభద్రయ్యగారు రామన్న కాపు ఇంటికి వచ్చాడు. ఇద్దరూ కలిసి లాంతర్లుచ్చుకుని బయల్దేరారు. తోవలో, పాలేరు అసిరిగాడు పరిగెత్తుకుంటూ ఎదురొచ్చాడు.

వొంటినిండా మన్నూ మశానమూ – రేగిన జుట్టూ వాడూ –

"ఏమిట్రా ఇదీ?"

పుంతదారిని వొస్తుంటే ఓ లంబాడీతండా అమాంతంగా మీదబడి, బళ్లని వాగుకడ్డంగా మళ్లేస్తోందిట – తనని కట్టేస్తుంటే, తప్పించుకుని లగెత్తుకుంటూ వొచ్చేశానన్నాడు.

వూళ్లో అలజడి పుట్టింది; ఆడంగులంతా నగా నాణెమూవుంటే, నూతుల్లోకి నిదానంగా జారవిడిచి, తలుపులు బిడాయించుకుని, లోపల తాళాలమీద తాళాలు వేసుకుని, బిక్కుబిక్కు మంటూ కూచున్నారు; జబ్బపుష్టివున్న పదిమందీ దుడ్డుకర్రలూ, లాంతర్లూ, బ్యాటరీలైట్లూ పుచ్చుకుని, రంగంలోకి దిగారు; అంతాకలిసి, వో చిన్న పటాలంకింద, ఏటిగట్టుకి బయలుదేరారు; ఏటి ఇసకలో, బళ్లగాడి మసక మసగ్గా అవుపిస్తోంది, ఏటికవతల తుమ్మల అడివిలో, చెట్లు ఈదరగాలికి శివమెత్తినట్టు వూగిసలాడుతున్నాయి – అంతా కీచురాళ్లమోత – జీబుగావుంది.

ఎవడికివాడు ముందడుగు వెయ్యడానికి వెనకాడుతున్నాడు. రామన్న కాపుమాత్రం చేతికర్ర దబాయించి, కుర్రకుంకలేమైనారో ఏమిటో అని ఆదుర్దాతో నిలదీసి అడిగాడు – 'వాళ్ల చేతుల్లో బాణాకర్రలూ గట్రా వున్నాయట్రా?' అని.

"ఓరి బాబోయ్ – కర్రలేమిటి? కత్తులేనా, కటారులేనా తళతళతళలాడాయంటోవుంటేను!!!

దానితో అందరికీ గుండె బేజారయిపోయింది; దండమీదికి మణిచిన చొక్కా చేతులన్నీ కిందకి దిగజారాయి; నలుగురూ కలిసి రామన్న కాపుని సాహసమొద్దని అటకాయించారు. భద్రయ్యగారికి ధాన్యం పోతోందే అనే బెంగలో మెదడు ఖాళీ అయి, గత్యంతరమేమిటి అనే ఆలోచన కూడా మానుకున్నాడు.

అంతా చాలాసేపు అక్కణ్ణే వుండిపోయారు – ఏటికవతల ఏదో కోలాహలంగా వుంది – తోటలోకి జొరబడే తెగింపు ఎవడికీ లేదు; వెనక్కిమళ్లుదామంటే, ఎవడి పిరికితనం వాణ్ణి లోపల వెక్కిరిస్తోంది; ఇది చాలక ఒహాయన మరో కొత్తభయం తెచ్చిపెట్టాడు.

"మనమంతా ఇక్కడ అహోరిస్తున్నామాయిరి – వాళ్లుగాని చుట్టుతిరిగి మన ఇళ్లల్లో జొరబడితే, దిక్కా మొక్కా?"

ఈ మాట బాగా పనిచేసింది; దానితో గుంపు పలచబడింది.

రాత్రి రెండుజాములవేళ, మునియ్య, పాలేళ్లూ, గట్రా అంటూ రోజుకుంటూ వొచ్చిపడ్డారు. మునియ్యకి వీపుమీద బాగా రాచుకుపోయింది. మూడో వాడికి కాలు బెణికిందో ఏమో, బాగా కుంటుతున్నాడు.

బళ్లు అటు పాలెంవేపుగాక, గరువుమీదనించీ, చింతలతోపు దగ్గిర మలుపుతిరిగినట్టు, అనుమానం బలీయంగా వున్నదట.

ప్రొద్దుట ఏటికవతల దూరంగా జువ్విచెట్టుకింద పగ్గాలు తెంపుకున్న బండీ యెద్లు

తాపీగా మేస్తున్నాయి. ఖాళీబళ్లు, అక్కడొకటీ, అక్కడొకటీ చెల్లాచెదురుగా పడివున్నాయి.

రామన్న కాపు గొడ్లపాకదగ్గిర, దూసర తీగతో దూడ మూతికని బుట్ట అల్లుతూ, పాలెంలో చెల్లెలిగారింటి క్షేమ సమాచారాలు కనుక్కొంటున్నాడు మునియ్యనడిగి.

వీరభద్రయ్య వొచ్చాడు.

"ఏమోయ్ రామన్న కాపూ, నువ్వు అప్పగించిన ధాన్యం కాస్తా ఇంటికి జారకుండానే నష్టమయిపోయిందాయెను - అంతా నన్నే చెడమంటావా? న్యాయమాలోచించు."

రామన్న కాపు ప్రశాంతంగానే సమాధానమిచ్చాడు.

"బాబూ - పంట నా స్వాధీనంలో వున్నప్పుడు పోయిందానికి మీరు బాధ్యత తీసుకున్నారు గనకనా, మీ స్వాధీనంలో వుండగా నష్టపోయిందానికి నా జవాబుదారీ సంగతి ఎత్తడానికి."

కంచెలమీద కాకరపువ్వులు పకాలుమని నవ్వాయి; గుమ్మపాలు కుదుస్తున్న తువ్వాయి మెళ్లో గంటలు గళ్లు -

వీరభద్రయ్య తెల్లమొగం వేశాడు ఒక్క మాటతో.